క్లుప్తంగా

కలసికట్టుగా పని చేయాలి



చల్లపల్లిలో జరిగిన సమావేశంలో పార్టీ నాయకులు

ఉప్పలగుప్తం: ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలంతా కలసికట్టుగా పనిచేయాలని వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు భద్రి బాబ్జి అన్నారు. చల్లపల్లిలో పార్టీ నాయకులు, సచివాలయ,బూత్‌ కన్వీనర్లు, గృహసారథులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. సీఎం జగన్‌ చేసిన అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు వివరించి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. అనంతరం బూత్‌ కన్వీనర్లకు కిట్లను అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ బడుగు మేరీకుమారి, పార్టీ నాయకులు దంగేటి రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, సొసైటీ అధ్యక్షుడు దంగేటి దొరబాబు, మండల జేసీఎస్‌ కన్వీనర్‌ కోటుం లోవరాజు, దాకారపు పండు తదితరులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం



సారా డబ్బాతో సీఐ సాయి స్వరూప్‌, సిబ్బంది

అమలాపురం టౌన్‌: అమలాపురం రూరల్‌ మండలం శెట్టిపేటలో స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో (ఎస్‌ఈబీ) పోలీసులు 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ నేరంతో సంబంధం ఉన్న అదే గ్రామానికి చెందిన బత్తిన సత్తిబాబును గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఎస్‌ఈబీ సీఐ సుంకర సాయి స్వరూప్‌, హెడ్‌ కానిస్టేబుల్‌ ఏవీఎస్‌ రామరాజు, కానిస్టేబుల్‌ వి.శ్రీనివాస్‌ ఈ దాడిలో పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు సాయం అందిస్తున్న శ్రీహరి రామ్‌గోపాల్‌ తదితరులు

అమలాపురం రూరల్‌: రెడ్డిపల్లి గ్రామంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి చుట్టుగుల్ల పుణ్యవతి శ్రీను, తవిటిక మంగాదేవి కుటుంబ సభ్యులకు దాతలు శుక్రవారం సాయం అందించారు. శ్రీవెంకటేశ్వరా డిగ్రీ కళాశాల సెక్రటరీ అండ్‌ కరస్పాండెంట్‌ కరాటం నరసింహారావు రూ.5 వేలు నగదు, కరాటం ప్రవీణ్‌ రూ. 5వేలు నగదు, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్‌, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, మండల సచివాలయ కన్వీనర్‌ చొల్లంగి సుబ్బిరామ్‌, డీసీసీబీ డైరెక్టర్‌ యిళ్ల గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్‌ కె.మనోహర్‌, ఎండీ కె.శ్రావణ్‌ దిలీప్‌ తదితరులు నిత్యావసర వస్తువులు, బియ్యం, కూరగాయలు, నూతన దుస్తులు, వంట సామగ్రిని అందించారు. అలాగే స్ఫూర్తి ఫౌండేషన్‌ సాధనాల శ్రీకాంత్‌ అశ్విని దంపతులు రూ.8వేలు విలువైన నిత్యావసరాలు, రూ.3వేలు నగదు బాధితులకు అందించారు. ఫౌండేషన్‌ ప్రతినిధులు డాక్టర్‌ అబ్దుల్‌ సలామ్‌, గొలి శారత, శ్రీనివాస్‌, చంద్రహాస్‌, గణేష్‌, రాంప్రసాద్‌, బుజ్జి, మమేష్‌ పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు, కిరాణా అందజేత



పేదలకు దుస్తులు, కిరాణా సామగ్రి పంపిణీ చేస్తున్న మహిళా వాకర్స్‌ ప్రతినిధులు

అమలాపురం టౌన్‌: స్థానిక మహిళా వాకర్స్‌ హెల్త్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక కూచిమంచి అగ్రహారంలో జరిగిన కార్యక్రమంలో తొలుత మహిళ ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పేదలకు చీరలు, పంచె లు, కిరాణా సామగ్రి పంపిణీ చేశారు. మహిళా వాకర్స్‌ క్లబ్‌ అధ్యక్షురాలు ఎస్‌ఎస్‌ పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ సేవా కార్యక్రమంలో క్లబ్‌ కార్యదర్శి అనంతలక్ష్మి, కోశాధికారి విజయలక్ష్మి, క్లబ్‌ మాజీ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి, క్లబ్‌ ప్రతినిధులు దువ్వూరి సుబ్బలక్ష్మి, శ్రీగిరి పద్మావతి, పేరి లలిత, వి.సాయిలక్ష్మి, జి.శారద పాల్గొన్నారు.

వ్యాపార వేత్తలుగా డ్వాక్రా మహిళలు



కోరంగిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌ చేయూత మహిళా మార్ట్‌



కోరంగి మహిళా మార్ట్‌లో వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

- మార్ట్‌లతో మహిళా సంఘాలకు ఆర్థిక చేయూత
- కార్పొరేట్‌ మార్ట్‌లకు దీటుగా అందుబాటులో వస్తువులు
- సామాన్యులకు తక్కువ ధరలకే నిత్యావసర వస్తువులు
- ఆదరణ చూపుతున్న అన్ని వర్గాల ప్రజలు
- లాభాల బాటలో మహిళా మార్ట్‌లు

తాళ్లరేవు: మహిళలను లక్షాధికారులుగా చేస్తానని మాటలు చెప్పడమే కాదు, డ్వాక్రా మహిళలతో చేయూత మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆ మాటలను నిజం చేశారు. నిన్నటి వరకు డ్వాక్రా మహిళలుగా ఉన్నవారిని వ్యాపారవేత్తలుగా మలిచారు. దీనిద్వారా మహిళలు ఆర్థిక పరిపుష్టిని సాధించడంతోపాటు వ్యాపార రంగంలో సైతం మహారాణులు కాబోతున్నారు. ఇప్పటివరకు చేయూత పథకం ద్వారా వ్యక్తిగత రుణాలు ఇచ్చి ప్రోత్సహించి ఎంతోమందికి జీవనోపాధి కల్పించిన ప్రభుత్వం ఇకపై ప్రతీ మహిళకు ఆర్థిక ప్రయోజనం చేకూరే విధంగా చర్యలను చేపట్టింది. దీనిలో భాగంగానే డీఆర్‌డీఏ వైఎస్సార్‌ క్రాంతి పథం పర్యవేక్షణలో మండల స్థాయిలో మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేస్తోంది. కార్పొరేట్‌ మార్ట్‌లకు దీటుగా ఏర్పాట్లను చేయడంతోపాటు అన్ని రకాల వస్తువులను అందుబాటులో ఉంచడం, తక్కువ ధరలకే వస్తువులను విక్రయించడంతో అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులవుతున్నారు. మహిళా సంఘాల ఆర్థిక పరిపుష్టే ధ్యేయంగా, గ్రామీణ ప్రాంతాల మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఈ మార్ట్‌లు సత్ఫలితాలిస్తున్నాయి. ప్రభుత్వ ఆలోచనలో భాగంగా తాళ్లరేవు మండలం కోరంగిలో వైఎస్సార్‌ చేయూత పథకం ద్వారా చేయూత మహిళా మార్ట్‌ను సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేశారు. మార్ట్‌ నిర్వహణకు అవసరమైన వ్యాపార మెళకువలు, కంప్యూటర్‌ పరిజ్ఞానం వంటి వాటిపై ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి మార్ట్‌లను విజయవంతంగా నడిపిస్తోంది. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ కృషితో ఏర్పాటు చేసిన ఈ మార్ట్‌ లాభాల బాటలో పయనిస్తోంది.

డ్వాక్రా మహిళలందరూ భాగస్వాములే

స్వయం సహాయక సంఘాల మహిళలు ఒక్కొక్కరి నుంచి రూ.200 వాటా ధనం సేకరించి వారిని భాగస్వామ్యులను చేశారు. తాళ్లరేవు మండలంలో 2,211 మహిళా స్వయం శక్తి సంఘాలకు గానూ 22,937 మంది నుంచి సుమారు రూ.45 లక్షలు సేకరించి వ్యాపారం ప్రారంభించారు. వేలాది రూపాయల విక్రయాలు జరుగుతూ సమృద్ధిగా వ్యాపారం సాగుతోంది. దీంతో మహిళా సంఘాల ఆర్థిక పరిపుష్టి కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం, మండల స్వయం సహాయక సంఘాల అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది.

కార్పొరేట్‌ మార్ట్‌లకు దీటుగా చేయూత మహిళా మార్ట్‌లు

కార్పొరేట్‌ మార్ట్‌లకు ఏమాత్రం తీసిపోని విధంగా సకల ఏర్పాట్లు చేశారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల నిత్యావసర వస్తువులతోపాటు, స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన వివిధ రకాల ప్రత్యేకతలు కలిగిన వస్తువులను సైతం ఈ మార్ట్‌లో అందుబాటులో ఉంచారు. పంచదార, బెల్లం, బియ్యం, పప్పులు, నూనెలు వంటి నిత్యావసర వస్తువులతోపాటు, అలంకరణ వస్తువులు, జ్యూట్‌ బ్యాగులు, మ్యాట్‌లు, వస్త్రాలు, కొబ్బరి పీచు ఉత్పత్తులు, వెజ్‌, నాన్‌వెజ్‌ పచ్చళ్ల తదితర సంప్రదాయ వస్తువులను మార్ట్‌లో అందుబాటులో ఉంచారు. పట్టణాల్లో సౌకర్యవంతమైన మార్ట్‌లను తలదన్నే విధంగా ఈ మార్ట్‌ను కూడా సెంట్రల్‌ ఏసీ చేసి వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు. వ్యాపార రంగంలో వస్తున్న నూతన ఒరవడులను గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం అందుబాటులోకి తేవాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ మార్ట్‌లు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

మండల మహిళా సమాఖ్యకు వెన్నుదన్ను



వైఎస్సార్‌ చేయూత పథకంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న మహిళా మార్ట్‌లు మండల మహిళా సమాఖ్యకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలువనున్నాయి. మహిళా సంఘాల నిర్వహణ కష్టసాధ్యమవుతున్న సమయంలో ఈ మార్ట్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేయడం ద్వారా మండల సమాఖ్య నిర్వహణ సులభతరం కావడంతోపాటు, మహిళల ఆర్థిక చేయూతకు ఎంతగానో దోహదపడుతుంది. బహిరంగ మార్కెట్‌లో ధరల కంటే తక్కువకు నిత్యావసర వస్తువులు విక్రయిస్తుండడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. గ్రామీణ స్థాయిలో సైతం అన్నిరకాల వస్తువులు అందుబాటులో ఉంటున్నాయి.

– రెడ్డి సన్యాసిరావు, ఏపీఎం, వైఎస్సార్‌ క్రాంతి పథం, తాళ్లరేవు

ధరలు తక్కువగానే ఉన్నాయి



చేయూత మహిళా మార్ట్‌లో వస్తువులన్నీ సామాన్యులకు అందుబాటు ధరలోనే ఉన్నాయి. సబ్బులు, పేస్టులు, పౌడర్ల దగ్గర నుంచి ఉప్పు, పప్పులు, నూనెలు బయటకంటే తక్కువ ధరకు లభిస్తున్నాయి. డ్వాక్రా సంఘాల సభ్యులు తయారు చేసే వివిధ రకాలైన వస్తువులు కూడా మార్ట్‌లో అందుబాటులో ఉంచారు. వ్యాపార రంగంలో సైతం మహిళల సత్తా చాటే విధంగా ప్రభుత్వం ఇటువంటి ప్రయత్నం చేయడం మా అదృష్టంగా భావిస్తున్నాము.

– దోనం మణి, పటవల

సంక్షేమం, అభివృద్ధికి పట్టం కడదాం



తానేల్లంకలో ఎమ్మెల్యే పొన్నాడకు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు



మోటారు బైక్‌పై ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పొన్నాడ, పార్టీశ్రేణులు

- మరోసారి జగన్‌ను సీఎం చేద్దాం
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పొన్నాడ
- అడుగడుగునా ప్రజల బ్రహ్మరథం

ముమ్మిడివరం: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని, ఈ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ముమ్మిడివరం వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ కోరారు. ముమ్మిడివరం మండలం తానేల్లంక పంచాయతీ పరిధిలో బాడవ, చిన పేట, పెద పేట, గోదశివారిపాలెం, వడ్డి గూడెం, పదవ మైలు సెంటర్‌ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు, వృద్ధులు, యువత ఆయనకు అడుగడుగునా బ్రహ్మ రథం పట్టారు. మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. వందలాది మంది వైఎస్సార్‌ సీపీ శ్రేణులు వెంట రాగా పొన్నాడ ఎన్నికల ప్రచారం చేశారు. ఫ్యాన్‌ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ వర్గాల ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. పలు కూడళ్లలో ఉన్న డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తూ అత్యధిక మెజార్టీతో తనను తిరిగి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్‌ కాశి బాలమునికుమారి, కోలా బాబ్జీ, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, మండల పార్టీ అధ్యక్షుడు జగతా పద్మనాభం, నల్లా నరసింహమూర్తి, నక్కా విజయరాణి, పులిదించి రాజేష్‌, బొంతు శ్రీనివాసరావు, మొల్లేటి లక్ష్మణరావు, కాశి రామకృష్ణ, మట్టపర్తి సత్యనారాయణ, రెడ్డి శివన్నారాయణ, పలువురు నాయకులు, కార్యకర్తలు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీ విజయానికి కృషి చేయాలి



నడిపూడిలో ఫ్యాను గుర్తుకు ఓటేయాలంటూ పార్టీ జెండాను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌ సీపీ నాయకులు

అమలాపురం రూరల్‌: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ విజయానికి బూత్‌ లెవెల్‌ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్‌ బొక్కా ఆదినారాయణ అన్నారు. సర్పంచ్‌ చెల్లుబోయిన నాని అధ్యక్షతన నడిపూడి గ్రామంలో శుక్రవారం మేము సిద్ధం.. మా బూత్‌ సిద్ధం కార్యక్రమంపై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించి, సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీకి ఓటు వేసేలా బూత్‌ సభ్యులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాయుడు బాల, సచివాలయ కన్వీనర్లు కుంపట్ల కేకే స్వామి, యాండ్రా మలేశ్వరి పరంశెట్టి శ్రీను, రంకిరెడ్డి రామలింగేశ్వర రావు, బూత్‌ కమిటీ సభ్యులు గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ఆయుధం



అమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్‌ కమిషనర్‌ మనోహర్‌ తదితరులు

అమలాపురం టౌన్‌: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటే ఆయుధం, ఓటు హక్కు ఉన్న ప్రతి వ్యక్తీ ఎన్నికల్లో తమ హక్కును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్‌ కమిషనర్‌ ఎస్‌.మనోహర్‌ పిలుపునిచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 'సిస్టమాటిక్‌ ఓటర్స్‌ ఎడ్యుకేషన్‌ అండ్‌ ఎలక్టోరల్‌ పార్టిసిపేషన్‌ (స్వీప్‌) ప్రోగ్రామ్‌లో భాగంగా మున్సిపల్‌, వార్డు సచివాలయాలు, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో అమలాపురంలో శుక్రవారం సాయంత్రం మానవహారం, అవగాహన ర్యాలీ నిర్వహించాయి. స్థానిక మున్సిపల్‌ కార్యాలయం నుంచి ప్రారంభమైన అవగాహన ర్యాలీ మెయిన్‌ రోడ్డు, గడియారం స్తంభం సెంటరు మీదుగా హైస్కూలు సెంటరుకు చేరుకుంది. స్థానిక గడియారం స్తంభం సెంటరులో మానవహారం నిర్వహించి ఓటు హక్కు విలువ గురించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సిటీ మిషన్‌ మేనేజర్‌ వి.రామలక్ష్మి, మున్సిపల్‌ డీఈఈ నాగ సతీష్‌, మేనేజర్‌ మాచిరాజు మూర్తితోపాటు పట్టణంలోని 15 వార్డ సచివాలయాల కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎల్జీగా రాధాకృష్ణన్‌ ప్రమాణ స్వీకారం



ఇన్‌ఛార్జి ఎల్జీ రాధాకృష్ణన్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దృశ్యం

యానాం: పుదుచ్చేరి లెఫ్టినెంట్‌ గవర్నర్‌(ఎల్జీగా) నియమితులైన సీపీ రాధాకృష్ణన్‌ శుక్రవారం సాయంత్రం ప్రమాణస్వీకారం చేశారు. ఇప్పటివరకూ ఎల్జీగా పని చేసిన తమిళిసై సౌందరరాజన్‌ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జార్ఖండ్‌ గవర్నర్‌గా ఉన్న రాధాకృష్ణన్‌కు పుదుచ్చేరి లెఫ్టినెంట్‌ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాలు జారీచేశారు. దీంతో శుక్రవారం తొలిసారిగా పుదుచ్చేరి వచ్చిన రాధాకృష్ణన్‌కు సీఎం రంగసామి, మంత్రులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రాజ్‌నివాస్‌లో జరిగిన కార్యక్రమంలో పుదుచ్చేరి ఎల్జీగా రాధాకృష్ణన్‌తో మద్రాసు హైకోర్టు ప్రధానన్యాయమూర్తి ఎస్‌.గంగపూర్వల ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో సీఎం రంగసామితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

లోక్‌సభ అభ్యర్థుల ప్రకటనతో కోలాహలం



కాంగ్రెస్‌ అభ్యర్థి వైథిలింగం



ఎన్‌ఆర్‌కాంగ్రెస్‌, బీజేపీ కూటమి అభ్యర్థి నమశ్శివాయం

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి పోటీ చేసే ప్రధాన పార్టీల అభ్యర్థుల పేర్లను శుక్రవారం ప్రకటించడంతో రాజకీయ కోలాహలం ప్రారంభమైంది. బీజేపీ, ఎన్‌ఆర్‌ కాంగ్రెస్‌ పార్టీల కూటమి నుంచి ప్రస్తుత హోంమంత్రి నమశ్శివాయంను రంగంలోకి దించారు. అదేవిధంగా కాంగ్రెస్‌ పార్టీ నుంచి ప్రస్తుత సిటింగ్‌ ఎంపీ, మాజీ ముఖ్యమంత్రి వైథిలింగంను ఆ పార్టీ ఇప్పటికే ప్రకటించింది. అదేవిధంగా అన్నాడీఎంకే అభ్యర్థిగా కె.తమిళవేందన్‌ను ఆ పార్టీ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో ప్రధాన పోటీ జరిగే పార్టీల అభ్యర్థుల ప్రకటనతో ప్రచారం ఊపందుకోనుంది. ఈనెల 20 నుంచే నామినేషన్ల పర్వం ప్రారంభమయినప్పటికి అభ్యర్థుల నామినేషన్లు ఇప్పటివరకూ ఎవరూ వేయలేదు. అయితే నామినేషన్ల అనంతరం అభ్యర్థులు ప్రచారం కోసం యానాం రానున్నారని ఆయా పార్టీల ప్రతినిధులు తెలిపారు.

యానాంలో విచిత్ర రాజకీయ పరిస్థితి

అసెంబ్లీ ఎన్నికల తర్వాత యానాం రాజకీయాల్లో పలు మార్పులు సంభవించాయి. ప్రస్తుత సీఎం రంగసామిపై ఇండిపెండెంట్‌గా గెలిచిన గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌ యానాం అభివృద్ధి పనుల దృష్ట్యా బీజేపీ, ఎన్‌ఆర్‌ కాంగ్రెస్‌ కూటమికి మద్దతునిస్తున్నారు. దీంతో ఆయన ఆ కూటమి తరఫున ప్రచారం చేయాల్సిన పరిస్థితి ఉంది. అయితే ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధిగా నామినేటెడ్‌ పదవిలో ఉన్న మల్లాడి కృష్ణారావు ఎన్‌ఆర్‌ కాంగ్రెస్‌కు మద్దతుదారుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మల్లాడి, గొల్లపల్లి ఇద్దరూ కలిసి ప్రచారంలో పాల్గొంటారా, విడివిడిగా ప్రచారం చేస్తారా అనేది చర్చనీయాంశమైంది. మరోవైపు మల్లాడి కృష్ణారావు సోదరుడు ఇటీవలి కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. దీంతో ఆయన కాంగ్రెస్‌ అభ్యర్థి వైద్యలింగానికి మద్దతుగా ప్రచారం చేస్తానని ప్రకటించారు. కోట్లాది రూపాయల మేర ఓఎన్‌జీసీ వేట నష్టపరిహారం అందుకున్న మత్స్యకార ఓటర్లు ఎన్‌డీఏ కూటమికి మద్దతునిస్తారా లేదా అనేది స్పష్టమవ్వాల్సి ఉంది. దీనిని బట్టే సీనియర్‌ నేత మల్లాడికి మత్స్యకారుల్లో ఉన్న పట్టు స్పష్టమవుతుందని రాజకీయవిశ్లేషకులు చెబుతున్నారు. ఇక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌ తన సొంత సామాజికవర్గం కాపులతోపాటు ఎస్సీ, బీసీల్లో గత అసెంబ్లీ ఎన్నికల్లో తనకున్న పట్టును చాటారు. మత్స్యకారుల్లో సైతం కొంత మేర ఓట్లు పొందారు. అయితే అదే ఒరవడి కొనసాగించాలని గొల్లపల్లి వర్గం తమ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు.

సబ్‌జైలు ప్రాంగణంలో స్వచ్ఛభారత్‌



సబ్‌జైలు ఆవరణలో చెత్త తొలగిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు

యానాం: పట్టణ పరిధిలోని సబ్‌జైలు ప్రాంగణంలో శుక్రవారం స్వచ్ఛభారత్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా రీజెన్సీ కళాశాల ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా 50 మంది ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు సబ్‌జైలు ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తను, వ్యర్థాలు, పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం జీవన్‌ నాయుడు కాలనీ, కామరాజునగర్‌, మెట్టకూరు రమాభాయ్‌నగర్‌, గణపతినగర్‌లో సైతం స్వచ్ఛభారత్‌ నిర్వహించి, స్థానికులకు ప్లాస్టిక్‌ వ్యర్థాల ద్వారా పర్యావరణానికి కలిగే నష్టాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ కోఆర్డినేటర్‌ చింతపల్లి కృష్ణసుధాకర్‌, ప్రోగ్రామ్‌ ఆఫీసర్‌ సరెళ్ల వీరకుమార్‌ పాల్గొన్నారు.

శివారు పొలాలకు సాగునీటిని అందించాలి

తాళ్లరేవు: మండంలోని పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు, దొమ్మేటిపేట, పోలేకుర్రు పంచాయతీ శివారు పంట పొలాలకు సాగునీరు అందక ఎండిపోతున్నాయని పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం డిమాండ్‌ చేసింది. శుక్రవారం సంఘ జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు నేతృత్వంలోని బృందం ఆయా ప్రాంతాల్లో పర్యటించి ఎండిపోతున్న వరిచేలను పరిశీలించారు. ఏటా దాళ్వా సమయంలో సాగునీరు అందక 80 నుంచి 100 ఎకరాలు ఎండిపోతున్నా అధికారులు తగు చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారన్నారు. మండలంలోని చమురు సంస్థలు యథేచ్ఛగా సాగునీటిని తోడేయడంతో వరి చేలకు నీరు అందడం లేదన్నారు. అధికారులు స్పందించి సాగునీటిని పూర్తిస్థాయిలో అందించాలని లేకుంటే తీవ్ర స్థాయిలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

హనుమత్‌, గజవాహనాలపై ఊరేగిన శ్రీవారు

రావులపాలెం: స్థానిక అలివేలు మంగా పద్మావతి ఆండాళ్‌ సహిత వేంకటేశ్వరస్వామి 15వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం స్వామికి లక్ష్మీవేంకటేశ్వరస్వామి హోమం వైభవంగా నిర్వహించారు. తొలుతగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఉదయాన్నే సుప్రభాత సేవ, సహస్రనామార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతం స్వామిని హనుమత్‌ వాహనంపై గోవిందమాలధారులు పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వాడపల్లి కమలనాథ్‌ ఆచార్యుల ఆధ్వర్యంలో పలు పూజలు జరిపారు. సాయంత్రం చూర్ణోత్సవం నిర్వహించారు. రాత్రికి స్వామికి గజవాహనోత్సవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఏర్పాట్లను దేవస్థాన పాలక మండలి చైర్మన్‌ పడాల పెదవెంకటరెడ్డి, ఇతర సభ్యులు పర్యవేక్షించారు. వాహనసేవలో పాల్గొన్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని స్వామివారి వాహన సేవలో పల్లకీని మోశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎన్నికల ప్రక్రియపై అవగాహన

అల్లవరం: ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్‌ ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం ఆధ్వర్యంలో సిస్టమేటిక్‌ ఓటర్‌ ఎడ్యుకేషన్‌ అండ్‌ ఎలక్టోరల్‌ పార్టీ సిపేషన్‌ కార్యక్రమంలో భాగంగా భారత ఎన్నికల ప్రక్రియపై శుక్రవారం బెండమూర్లంక పంచాయతీ పరిధిలోని ఆరగట్లపాలెంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కుని వినియోగించుకోవాలని ప్రచారం నిర్వహించారు. ప్రోగ్రామ్‌ ఆఫీసర్‌ ఎస్‌టీ నాయుడు, వీఆర్‌ఓ మెట్ల బాలనరసింహమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

అంధుల పాఠశాలకు వితరణ



బీరువా, ప్లాస్కులు అందిస్తున్న రాంబాబు తదితరులు

అమలాపురం టౌన్‌: పట్టణంలోని లూయి అంధుల పాఠశాలకు మామిడికుదురు మండలం మగటపల్లి నామన ఫౌండేషన్‌ గాడ్రెజ్‌ బీరువా, 25 కూలింగ్‌ వాటర్‌ ప్లాస్కులు శుక్రవారం బహూకరించింది. విద్యార్థుల సౌకర్యం కోసం ఫౌండేషన్‌ సభ్యురాలు నామన కృష్ణవేణి జ్ఞాపకార్థం ఆమె కుమారుడు నామన వినోత్‌ వీటిని అంధుల పాఠశాలకు సమకూర్చారు. వాటిని పాఠశాల మేనేజర్‌ రామయాణం శ్రీనివాసరావుకు అందజేశారు. ఫౌండేషన్‌ చైర్మన్‌ నామన రాంబాబు, ఫౌండేషన్‌ ప్రతినిధులు బండారు రామమోహనరావు, మట్ట సాయి రామారావు, దాసం సురేష్‌, రంకిరెడ్డి బుజ్జి, తిరుమనాథం మురళీకృష్ణ, నామన శేఖర్‌ తదితరుల చేతల మీదుగా పాఠశాల యాజమాన్యానికి, అంధ విద్యార్థులకు పంపిణీ చేశారు.

352 మందికి వైద్య పరీక్షలు



చల్లపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉప్పలగుప్తం: చల్లపల్లి గ్రామం సచివాయం–3 వద్ద శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ఢిల్లీ ప్రసాద్‌ ఆధ్వర్యంలో 352 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్‌, ఈవోపీఆర్‌డి కె.ఎస్‌.గౌరీకుమారి, వైద్యులు సుశ్మిత, భార్గవ్‌ కుమార్‌, పంచాయితీ కార్యదర్శి పెట్టా నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామానికి చెందిన ఆనాల ఛాయారత్నం(70) శుక్రవారం మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యుల అనుమతితో స్థానిక సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ మాట్లాడి ఛాయారత్నం నేత్రాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు దానం చేశారు. ఐ బ్యాంక్‌ సిబ్బంది రవి, నాని ఛాయారత్నం కార్నియాలను సేకరించారు. ఆమె కుటుంబ సభ్యులను ధూళిపూడి సత్యనారాయణ, సూర్యారావు, శుభ, విశ్వేశ్వరరావు, ప్రసాద్‌, నిమ్మకాయల సాయిరాం, ఆనాల పాపారావు, వుంగరాల వెంకటేశ్వరరావు అభినందించారు.

రేపు ప్రపంచ కవితా దినోత్సవ సభ

యానాం: కవిసంధ్య యానాం ఆధ్వర్యంలో భాషా, సాంస్కృతిక శాఖ హైదారాబాద్‌ వారి సౌజన్యంతో ఆదివారం రవీంద్రభారతి సమావేశ మందిరంలో ప్రపంచ కవితా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు శుక్రవారం కవిసంధ్య అధ్యక్షుడు ప్రముఖకవి శిఖామణి ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కవిత్వంపై కొప్పర్తి ప్రత్యేక ప్రసంగం, కవితల పోటీ బహుమతుల ప్రదానం, కవి సంధ్య పత్రిక, కవిత్వ గ్రంథాల ఆవిష్కరణ, కవి సమ్మేళనం ఉంటాయన్నారు. శిఖామణి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రముఖ కవులు శివారెడ్డి, వాడ్రేవు చినవీరభద్రుడు, దాట్ల దేవదానంరాజు, డానియేల్‌ నెజర్స్‌, మామిడి హరికృష్ణ, శీలాసు భద్రాదేవి, సుధామ, యార్లగడ్డ రాఘవేంద్ర రావు, ఆంజనేయశర్మ, ఎస్‌.రాంబాబు, చల్లా రామఫణి పాల్గొంటారన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి రథయాత్ర



యానాం: శతాబ్దాలుగా వస్తున్న యానాంలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవాలలో భాగంగా శనివారం రథయాత్ర వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఫాల్గుణ మాసంలో ఇరవై నాలుగు రోజుల పాటు కల్యాణోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ వస్తోంది. దీంతో కల్యాణం ఫాల్గుణ శుద్ధ ద్వాదశినాడు అంటే పన్నెండో రోజు నిర్వహిస్తారు. పద్నాలుగోరోజు రథోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఏటా రథం చిన్నాసెంటర్‌ నుంచి పిల్లారాయవీధి మీదుగా వెళ్లి కొత్తబస్టాండ్‌ వద్ద రథయాత్ర ముగుస్తుంది. ప్రస్తుతం కళిరెడ్డి సత్యవీరవెంకన్న, వెంకటకృష్ణయ్య, యర్రా లక్ష్మణరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావుల సోదరులచే రథయాత్రను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌ దంపతులు హాజరుకానున్నారు.